క్లుప్తంగా

వైభవంగా చెన్నకేశవుని కల్యాణం



చెన్నకేశవుని కల్యాణోత్సవం

మనుబోలు : స్థానిక దళితవాడలోని చెన్నకేశవాలయంలో శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి కల్యాణాన్ని సోమవారం అర్ధరాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. ఉభయకర్తలుగా గౌడ సంఘం వారు వ్యవహరించారు. నిర్వాహకులు ఆలయం వద్ద అన్నదానం చేశారు.

కొత్త పింఛన్ల పంపిణీ



పింఛన్లను అందజేస్తున్న సొసైటీ చైర్మన్

పొదలకూరు : మండలంలోని మహ్మదాపురం గ్రామ సచివాలయంలో కొత్తగా మంజూరైన పింఛన్లను సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి చేతులమీదుగా మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోగిరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో నూతనంగా పది మందికి పింఛన్లు మంజూరైనట్లు తెలిపారు. రూ.2,500 నుంచి రూ.2,750 పెంచిన పింఛన్లను అందుకున్న లబ్ధిదారుల ఆనందానికి అవధులు లేవన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కరిపరెడ్డి కృష్ణారెడ్డి, నాయకులు పుచ్చా చెంచుకృష్ణారెడ్డి, కండ్లకూటి రమణారెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల అందజేత



విద్యార్థికి ట్యాబ్‌ను అందజేస్తున్న వైస్ ఎంపీపీ

పొదలకూరు : మండలంలోని మరుపూరు జెడ్పీ హైస్కూల్లో ప్రభుత్వం 8వ తరగతి విద్యార్థులకు అందజేసిన ట్యాబ్స్‌ను వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి చేతులమీదుగా మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని దేశంలో ఎక్కడా లేనివిధంగా 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజు, పీసీ చైర్మన్ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్డీఓ విచారణ

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని మినగల్లు గ్రామంలో వివాదాస్పదంగా ఉన్న భూమికి సంబంధించి నెల్లూరు ఆర్డీఓ మలోల మంగళవారం విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి తన భూమి రీ సర్వేలో మరొకరి పేరుపై నమోదైనట్లు జేసీకి ఫిర్యాదు చేశారని ఆర్డీఓ తెలిపారు. ఈ మేరకు జేసీ ఆదేశాల మేరకు విచారణ చేపట్టామన్నారు. రీ సర్వే రికార్డులను పరిశీలించడంతో పాటు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తుల వద్ద ఉన్న రికార్డులను పరిశీలించామన్నారు. ఆయన వెంట తహసీల్దార్ ప్రమీల ఉన్నారు.

బహుమతుల అందజేత

తోటపల్లిగూడూరు : తోటపల్లిగూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రతిభావంతులైన పలువురు విద్యార్థులకు మంగళవారం ప్రోత్సాహక బహుమతులను దాతలు అందించారు. ఎన్‌డీఆర్ గ్రూపు సంస్థల వ్యవస్థాపకుడు నాయుడు దశరథరామిరెడ్డి 24వ వర్ధంతి సందర్భంగా విద్యార్థులకు పురస్కారాలు అందించారు. దీంతో పాటు 400 మంది విద్యార్థులకు భోజనం ప్లేట్లు, కళాశాల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశామని నాయుడు నాగేశ్వరమ్మ ట్రస్టు చైర్మన్ నాయుడు ఆదికేశులరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రియాజ్, కళాశాల ప్రిన్సిపల్ ధనుంజయ, నాయుడు వెంకటనరసారెడ్డి, ఉపాధ్యాయులు తోటా శ్రీనివాసులు, ఇంగిలా బాలకృష్ణ పాల్గొన్నారు.

కోర్టు ఆదేశాలను ధిక్కరించలేదు

- ఉపాధిహామీ ఏపీఓ మధుసూదన్

పొదలకూరు : మండలంలోని చాటగొట్ల గ్రామ సమీపంలో కోర్టు ఆదేశాలను ధిక్కరించి ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులు చేపట్టలేదని ఉపాధి హామీ ఏపీఓ మధుసూదన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సర్వేనంబరు 9లో ఉన్న భూమిని జగనన్న కాలనీ కోసం ఎంపిక చేసి పనులు చేపట్టిన తర్వాత చాటగొట్లకు చెందిన వారు కోర్టుకు వెళ్లినట్టు తెలిపారు. అయితే ప్రస్తుతం మండలంలో ఉపాధి పనులకు సంబంధించిన సోషల్ ఆడిట్ జరుగుతున్న నేపథ్యంలో గతంలో చేసిన పనులకు సంబంధించి కొలతలు తీసుకునేందుకు సోమవారం వెళ్లామన్నారు. ఈలోగా సోషల్ మీడియాతో పాటు, ఓ దినపత్రిక రాత్రివేళల్లో పనులు చేస్తున్నట్లు రాయడంలో నిజం లేదన్నారు.

డిగ్రీ కళాశాలలో వైద్యశిబిరం

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు) : విడవలూరులోని పీఆర్‌ఆర్ అండ్ వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెడికవర్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో గ్రామస్తులు, విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఆస్పత్రి డీఎంఓ వాసు మాట్లాడుతూ కేన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. డాక్టర్ శ్రీవిద్య, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ఎస్.మధు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సురేష్ పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలే జీవితం ఆదర్శప్రాయం

- వీఎస్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ రామచంద్రారెడ్డి
- ఘనంగా పూలే జయంతి

వెంకటాచలం : సావిత్రీబాయి పూలే జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని వీఎస్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి తెలిపారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమసింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ)లో మంగళవారం సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రీబాయి పూలే చిత్రపటానికి రిజిస్ట్రార్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె జీవిత చరిత్ర గురించి ఆయన వివరించారు. మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయినిగా ఆమె ఎన్నో నిందలు, అవమానాలు ఎదుర్కొన్నా, ధైర్యంగా నిలబడి గొప్ప స్థాయికి వచ్చారని చెప్పారు. ఆమె జీవితం ఉపాధ్యాయులందరికీ సందేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ విజయానంద్ కుమార్ బాబు, ఎన్ ఎస్ ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బాలికా విద్యకు ఎంతో కృషి

కొడవలూరు : బాలికా విద్యకు సావిత్రీబాయి పూలే ఎంతో కృషి చేశారని ఎంఈఓ జి.వసంతకుమారి కొనియాడారు. సావిత్రీబాయి పూలే 192వ జయంతి సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆమె చిత్రపటానికి మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ భారతదేశపు మొదటి మహిళా ఉపాధ్యాయినిగా మహిళా విద్యకు బీజం వేశారన్నారు. ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఎన్నో బాధలకోర్చి బాలికలు చదువుకునేలా చేసిన గొప్ప సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే అని చెప్పారు. దేశం అభివృద్ధి చెందాలంటే మహిళలు కూడా విద్యావంతులు కావాలని తలచి అందుకు ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఏపీఎం ఎస్.రుక్మిణి, మండల పరిషత్ సూపరింటెండెంట్ సురేష్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయుడు పూండ్ల చిన్నయ్య, సీఆర్‌పీలు ఎం.దయాకర్, సీహెచ్.శ్రీహరిబాబు, జె.పెంచలరావు, రమేష్, లీలయ్య, వీరాంజనేయులు, వెంకట సురేష్ పాల్గొన్నారు.

వెంకన్నపురంలో..

మండలంలోని వెంకన్నపురం ప్రాథమిక పాఠశాలలో సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. కుల, మతాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమ స్వరూపిణి సావిత్రిబాయి పూలే అని హెచ్‌ఎం తాటిపర్తి వెంకటేశ్వర్లు కొనియాడారు. ఉపాధ్యాయిని బి.శ్రీశైల, విద్యార్థులు పాల్గొన్నారు.

సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో..

ఇందుకూరుపేట : మండంలోని పల్లిపాడులో ఉన్న పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆశ్రమ కోర్‌కమిటీ సభ్యురాలు గంపల మంజుల విద్యార్థులతో కలిసి పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. సమాజంలో కులతత్వం, పురుషాధిక్యతపై పోరాడిన వనిత అని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయిని సీహెచ్ రేవతి, అంగన్‌వాడీ కార్యకర్త మస్తానమ్మ పాల్గొన్నారు.

పూలే చొరవతో మహిళా విద్య

బుచ్చిరెడ్డిపాళెం : మహిళల విద్యకు సావిత్రీబాయి పూలే చూపిన చొరవ ఎనలేనిదని చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ అన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలోని రెయిన్‌బో పాఠశాలలో మంగళవారం సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. విద్యకు దూరంగా ఉన్న మహిళల్లో కూడా విద్య బుద్ధులు అందించాలని సావిత్రీబాయి పూలే తపన పడేవారన్నారు. అనంతరం పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించడంతో పాటు మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో దళిత నేత భీమతాటి వెంకటరమణయ్య, ప్రిన్సిపల్ చిట్టిబాబు పాల్గొన్నారు.

ఆదర్శ మహిళ సావిత్రిబాయి పూలే

ముత్తుకూరు : సావిత్రీబాయి పూలే ప్రప్రథమ ఉపాధ్యాయినిగా, ఆదర్శ మహిళగా చరిత్రలో నిలిచిపోయారని ముత్తుకూరులోని ఈదూరు ఈశ్వరమ్మ జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం చెంచురామయ్య అన్నారు. జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మంగళవారం సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మహిళలు తప్పనిసరిగా చదువుకోవాలని పూలే ఆకాంక్షించారని అన్నారు. అనంతరం సీనియర్ మహిళా ఉపాధ్యాయిని సీహెచ్ అనంతలక్ష్మిని సత్కరించారు.

చెన్నపల్లిపాళెంలో..

తోటపల్లిగూడూరు : మండలంలోని చెన్నపల్లిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ క్రమంలో ఉపాధ్యాయినులకు సన్మానం చేశారు. అనంతరం పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు వకృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు పాఠశాల విద్యాకమిటీ సభ్యుడు మారంరెడ్డి బుజ్జిరెడ్డి ప్రోత్సాహక బహుమతులు అందించడంతో పాటు విద్యార్థులకు మిఠాయిలను పంచిపెట్టారు. అనంతరం హెచ్‌ఎం రూప మాట్లాడుతూ టీచర్లందరూ సావిత్రీబాయిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు ఫణికుమార్, మురళీ, పద్మజ, విద్యాధరి, సులోచన, మోహన్, బుజ్జయ్య, రమణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వెంకటాచలం : సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళి అర్పించిన వీఎస్‌యూ రిజిస్ట్రార్, అధ్యాపకులు



కొడవలూరు : సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు



ఇందుకూరుపేట : పల్లిపాడులోని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో..



ముత్తుకూరు : పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం, టీచర్లు



కొడవలూరు : వెంకన్నపురం ప్రాథమిక పాఠశాలలో..



తోటపల్లిగూడూరు : విజేతలకు ప్రోత్సాహకాలను అందజేస్తున్న టీచర్లు

ఎంపీ వేమిరెడ్డిని కలిసిన మావులూరు



ఎంపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మావులూరు

ఇందుకూరుపేట : రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరులోని ఎంపీ నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. నాయకులు వేణుంబాక మహిధర్‌రెడ్డి, దండిగుంట ఫణీంద్రనాయుడు, మారుబోయిన సంతోష్ గౌడ్ ఉన్నారు.

6 నుంచి బ్యాడ్మింటన్ పోటీలు

పొదలకూరు : ఈనెల 6, 7, 8వ తేదీల్లో కాకాణి రమణారెడ్డి స్మారకార్థం వినాయక షటిల్ క్లబ్ ఆధ్వర్యంలో పొదలకూరులో ఐదు జిల్లాల ఓపెన్ కేటగిరి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహిస్తామని క్లబ్ అధ్యక్షుడు వి.లక్ష్మీనారాయణ మంగళవారం తెలిపారు. నెల్లూరు, తిరుపతి, ప్రకాశం, కడప, అన్నమయ్య జిల్లాల క్రీడాకారులు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులుగా పేర్కొన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నుడా చైర్మన్, రాష్ట్ర షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ పోటీలను ప్రారంభిస్తారన్నారు. ఓపెన్ కేటగిరిలో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన వారికి రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.7 వేలు, రూ.5 వేలు అందజేస్తామన్నారు. 40 ప్లస్ విభాగంలో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన వారికి రూ.5 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు, 50 ప్లస్ విభాగంలో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన వారికి రూ.5 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు అందజేస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం 94401 96425 నంబర్‌కు సంప్రదించాల్సిందిగా సూచించారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం



పొదుపు సంఘాలకు మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు : గ్రామాల అభివృద్ధి, అన్నివర్గాల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. కోవూరు రుక్మిణి కల్యాణ మండపంలో మంగళవారం నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. అనంతరం పొదుపు మహిళలకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గంలో ఇప్పటివరకు 42,900 మందికి పింఛన్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం ద్వారా ఏళ్ల తరబడి ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో కోవూరు మండలంలో వివిధ బ్యాంకుల నుంచి 368 పొదుపు సంఘాలకు రూ.42.32 కోట్లు అందిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో కొత్త పింఛన్ మంజూరు కావాలంటే జన్మభూమి కమిటీల పెత్తనం అధికంగా ఉండేదన్నారు. ప్రస్తుతం అర్హతే ప్రామాణికంగా పింఛన్లను అందజేస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి మాట్లాడుతూ వివిధ బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని సూచించారు. తీసుకున్న రుణాలతో ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు.

గ్రామంలో పర్యటన

కోవూరు సచివాలయం–5 పరిధిలో జరిగిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రసన్న పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. స్థానిక సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. సైడు కాలువలు, రోడ్లు తదితర వాటికి అనుమతులు మంజూరు చేస్తూ వాటిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, కోవూరు నియోజకవర్గ సమన్వయకర్త బాలచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, డీఎల్‌డీఏ డైరెక్టర్ దినేష్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షులు నరసింహులురెడ్డి, సాయిలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

సచివాలయ కన్వీనర్లు, గ్రామ వలంటీర్లు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే ప్రసన్న సూచించారు. కోవూరు సచివాలయ పరిధిలో ముగ్గురు కన్వీనర్లలో ఇద్దరు పురుషులు, ఒక మహిళ తప్పనిసరిగా ఉండేలా నియమించినట్లు తెలిపారు. వీరంతా కలిసికట్టుగా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం కోవూరు తాలూకా ప్రభుత్వ ఉద్యోగుల నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

విభిన్న ప్రతిభావంతుల అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం : విభిన్న ప్రతిభావంతుల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని సరస్వతీనగర్ వద్ద ఉన్న విభిన్న ప్రతిభావంతుల కాంపోజిట్ రీజనల్ సెంటర్(సీఆర్‌సీ) ఏడో వార్షికోత్సవ వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాను మంత్రి కాకాణి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయి సంస్థ అయిన సీఆర్‌సీ వెంకటాచలం మండలంలో ఉండటం జిల్లా వాసుల అదృష్టంగా భావించాలని చెప్పారు. సంస్థ ద్వారా దివ్యాంగులకు అందిస్తున్న సేవలు చాలా అమోఘమైనవని కొనియాడారు. ఈ సంస్థలో పనిచేస్తున్న సిబ్బంది ఎంతో ఓపికతో దివ్యాంగుల్లో మార్పులు తీసుకొస్తుండడం అభినందనీయమన్నారు. దివ్యాంగుల తల్లిదండ్రులు కూడా ఆత్మస్థైర్యంతో, దృఢ సంకల్పంతో బిడ్డలను ఓర్పుగా చూసుకుని వారికి మంచి భవిష్యత్ అందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. వారికి అన్నిరకాల ఉపకరణాలు, మోటారు వాహనాలు అందిస్తున్నామని, త్వరలోనే మెగా మేళా నిర్వహించి మరిన్ని ఉపకరణాలను అందజేస్తామన్నారు. గతంలో నిర్వహించిన జాబ్‌మేళాలో అనేక మంది వికలాంగులు ఉద్యోగాలు పొందారని, ప్రస్తుతం నిర్వహించే జాబ్‌మేళాలో మరికొంత మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుండడం చాలా సంతోషంగా ఉందన్నారు. దివ్యాంగులకు అన్నివిధాల అండగా ఉండేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక కృషి చేస్తున్నారని తెలియజేశారు. ఈ సందర్భంగా దివ్యాంగులు తమ నైపుణ్యంతో తయారు చేసిన వస్తువులను ప్రదర్శిస్తూ ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ను మంత్రి కాకాణి తిలకించి అభినందించారు. జాబ్‌మేళాలో ఎంపికైన పలువురు దివ్యాంగులకు ఉద్యోగ ధ్రువీకరణ పత్రాలు, మోటారు వాహనాలను మంత్రి చేతులు మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ నాగరాజకుమారి, సీఆర్‌సీ డైరెక్టర్ రాజ్ మణిపాల్, కోఆర్డినేటర్ మారుతీకృష్ణ, ఎంపీపీ మందా కవిత, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య, నాయకులు వెలిబోయిన వెంకటేశ్వర్లు, తాటిపర్తి సురేష్, షాజహాన్ పాల్గొన్నారు.



దివ్యాంగురాలికి ఉద్యోగ ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న మంత్రి గోవర్ధన్‌రెడ్డి

బీమా నగదు అందజేత

కొడవలూరు : మండలంలోని యల్లాయపాళెనికి చెందిన బెల్లంకొండ సూలమయ్య అనారోగ్యంతో మృతిచెందారు. వీరికి వైఎస్సార్ బీమా కింద రూ.లక్ష మంజూరైంది. అంత్యక్రియల నిమిత్తం బీమా నగదులోని రూ.10 వేలను మృతుని భార్య సుబ్బమ్మకు మంగళవారం అందజేశారు. మిగిలిన రూ.90 వేలను త్వరలో బాధిత కుటుంబానికి చెల్లించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి జానకిరామయ్య తెలిపారు.

నేడు చెముడుగుంటలో 'గడప గడపకు..'

వెంకటాచలం : మండలంలోని చెముడుగుంటలో బుధవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య మంగళవారం తెలిపారు. సాయంత్రం 4.30 గంటలకు ప్రారంభం కానున్న కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పాల్గొంటారని తెలియజేశారు.

దుప్పట్ల పంపిణీ



బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెంలోని భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు మంగళవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ దిలీప్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సభ్యుడు మురళీకృష్ణ తనయుడు భువన సాయి పుట్టినరోజు సందర్భంగా చిన్నారులకు దుప్పట్లను పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు వెంకటేశ్వర్లు, రాజేంద్రప్రసాద్, రిసోర్స్‌పర్సన్ గండికోట సుధీర్‌కుమార్, ఉపాధ్యాయులు శ్రీనివాసులరెడ్డి, శేషమ్మ పాల్గొన్నారు.

సభలు, రోడ్‌షోలకు అనుమతులు తప్పనిసరి

- సీఐ కోటేశ్వర్రావు

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చి సర్కిల్ పరిధిలోని విడవలూరు, కొడవలూరు, బుచ్చిరెడ్డిపాళెం మండలాల్లో కుల, మత, పార్టీలకు సంబంధించిన సభలు, లేదా రోడ్ షోలు నిర్వహించాలంటే తప్పనిసరిగా పోలీసుల అనుమతులు తీసుకోవాలని బుచ్చిరెడ్డిపాళెం సీఐ చిట్టెం కోటేశ్వర్రావు తెలిపారు. ఈ మేరకు బుచ్చిరెడ్డిపాళెంలోని తన కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఇటీవల ప్రతిపక్ష నేత చంద్రబాబు పర్యటనలో భాగంగా జరిగిన తొక్కిసలాటలో కందుకూరులో 8 మంది, గుంటూరు జిల్లాలో ముగ్గురు ప్రాణాలను కోల్పోవడం చాలా బాధాకరమన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం జీఓ నంబర్–1ను అమల్లోకి తీసుకొచ్చిందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని సభలు, రోడ్‌షోలకు ముందుగా పోలీసులను ఆశ్రయించాలన్నారు. ఆయా ప్రాంతాన్ని పరిశీలించి తరువాత మాత్రమే అనుమతులు ఇస్తామన్నారు. ఈ విషయంలో ఎవరైన అనుమతులు లేకుండా సభలు, రోడ్‌షోలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈయన వెంట ఎస్సై వీరప్రతాప్ ఉన్నారు.



మాట్లాడుతున్న సీఐ కోటేశ్వర్రావు

వేడుకగా గ్రామోత్సవం



ముత్తుకూరు : ముక్కోటి ఏకాదశి పర్వదిన వేడుకలు మంగళవారం వేకువ జామున ముగిశాయి. ముత్తుకూరు, ఈపూరు, నేలటూరు పంచాయతీల్లోని చెన్నకేశవస్వామి ఆలయాల్లో సోమవారం రాత్రి విశేష పూజల అనంతరం స్వామి వారికి గ్రామోత్సవం నిర్వహించారు. వేకువజాము వరకు ఈ గ్రామోత్సవం జరిగింది. రాత్రంగా ఆలయాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో జాగరణ చేశారు.

జల్‌జీవన్ మిషన్‌తో రక్షిత తాగునీరు

బుచ్చిరెడ్డిపాళెం : జల్‌జీవన్ మిషన్ ద్వారా మండలంలోని ప్రజలకు రక్షిత తాగునీటిని అందిస్తున్నట్లు ఎంపీడీఓ నరసింహారావు అన్నారు. మండలంలోని జొన్నవాడ పంచాయతీ కార్యాలయంలో జల్‌జీవన్ మిషన్‌పై మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ పథకం కింద మండలంలో 36 పనులకు దాదాపు రూ.3.42 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఈ పనులను త్వరగా పూర్తి చేసి తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రంగప్రసాద్, ఏఈ వినయ్ పాల్గొన్నారు.

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం

పొదలకూరు : ముక్కోటి ఏకాదశి సందర్భంగా అయ్యప్పనగర్లోని శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానం, లక్ష్మీ గోదా వెంకటేశ్వరస్వామి దేవస్థానాల్లో స్వామి అమ్మవార్ల కల్యాణం కమనీయంగా జరిగింది. గరుడసేవ ఊరేగింపు తర్వాత సోమవారం రాత్రి వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



వెంకటేశ్వరుడి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

విద్యుత్ రాయితీని సద్వినియోగం చేసుకోండి

బుచ్చిరెడ్డిపాళెం : ఆక్వా రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యుత్ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని మత్స్యశాఖ అధికారి పాట్టేయ్య అన్నారు. మండలంలోని కాగొల్లపాడు సచివాయలంలో ఆక్వాజోనేషన్‌పై రైతులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆక్వా రైతులు తమ పేర్లు, సాగు వివరాలను తప్పనిసరిగా ఆక్వాజోనేషన్‌లోని ఈ– ఫిష్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ చెన్నమ్మ, కార్యదర్శి అక్బర్, మత్స్యశాఖ అసిస్టెంట్ రంజిత్ పాల్గొన్నారు.

విడవలూరులో

విడవలూరులోని ఆర్బీకేలో ఆక్వా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మత్స్యశాఖ అసిస్టెంట్ దివ్య మాట్లాడుతూ త్వరగా ఆక్వా రైతులంతా వారి వివరాలతో పాటు సాగు వివరాలను కూడా నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న మత్స్యశాఖ అధికారి పాట్టేయ్య

డొంకను ధ్వంసం చేశారని ఆందోళన

- మరమ్మతులు చేయించాలని డిమాండ్

మనుబోలు : మనుబోలు పొలాలకు వెళ్లే డొంకను భారీ వాహనాలు ధ్వంసం చేస్తున్నాయంటూ మంగళవారం రైతులు వాహనాలను అడ్డుకుని ఆందోళనకు దిగారు. మనుబోలు హైవే నుంచి రైల్వేలైన్ వరకు పడమటి వైపు పొలాలకు డొంక ఉంది. గత ఏడాదిన్నరగా మనుబోలు పరిధిలో మూడో రైల్వే లైన్ పనులు జరుగుతున్నాయి. పనుల్లో భాగంగా మెటీరియల్‌ను తరలించేందుకు భారీ వాహనాలు వెళ్తుంటాయి. ఈ క్రమంలో పొలాలకు వెళ్లే డొంకలో పెద్దపెద్ద గుంతలు ఏర్పడి ట్రాక్టర్‌లు, ఎద్దుల బండ్లు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందిగా ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది ఇలాగే డొంకకు మరమ్మతులు చేయించాలంటూ ఆందోళనకు దిగితే రైల్వే కాంట్రాక్టర్ చేయిస్తానని హామీ ఇచ్చాడని, అయితే ఇంత వరకు ఏమీ చేయలేదన్నారు. ఈసారైనా మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు.



వాహనాలను నిలిపి ఆందోళన చేస్తున్న రైతులు